సాక్షి
కాకినాడ
మంగళవారం । 13 । మే । 2025



అన్నదాన భవనానికి రూ.లక్ష


కొత్తపేట: వాడపల్లి క్షేత్రంలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి అడ్డగర్ల శ్రీనివాసరావు దంపతులు (అనకాపల్లి) రూ.1,00,008 విరాళం సమర్పించారు.



రూ.లక్ష విరాళం

కోరుకొండ: గుమ్ములూరు శ్రీకృష్ణ దేవాలయానికి విశ్వహిందూధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు రూ.లక్ష విరాళం అందించారు.

బ్యారేజీ వద్ద పెరిగిన నీటిమట్టం



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సముద్రంలోకి గోదావరి మిగులు జలాల విడుదలను నిలిపివేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.30 అడుగులకు పెరిగింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

పీజీఆర్ఎస్‌కు 373 అర్జీలు



అర్జీదారుల సమస్య వింటున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు 373 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ షణ్మోహన్ సగిలి, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్‌ఓ వెంకటరావు, జెడ్పీ సీఈఓ వీవీ లక్ష్మణరావు, హౌసింగ్ బోర్డు పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, సీపీఓ పి.త్రినాథ్ తదితరులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి మాత్రమే ఎండార్స్‌మెంట్ చేయాలని సూచించారు. సక్రమంగా పరిష్కరించని వాటిని రెండు స్థాయిల్లో ఆడిట్ జరిపి, రీ ఓపెన్ చేస్తారని, అలా ఎక్కువ రీ ఓపెన్ చేసిన శాఖ అధికారులకు మెమోలు జారీ చేస్తారని హెచ్చరించారు. అర్జీదారులు మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీకి సంబంధించిన సమాచారం తెలుసుకోవాలంటే 1100 నంబర్‌కు నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు.

సీహెచ్‌ఓల భిక్షాటన

కాకినాడ సిటీ: తమ డిమాండ్ల పరిష్కారానికి గత పది రోజులు నుంచి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌ఓ) సోమవారం భిక్షాటన చేశారు. మానవ హారంగా ఏర్పడి ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చాలని నినదించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు వైద్యం చేస్తున్న సీహెచ్‌ఓలు ఇలా భిక్షాటన చేయడంతో ప్రజలు వారి పట్ల సానుభూతి ప్రకటించారు. ఉద్యమాన్ని కొనసాగిస్తామని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 47 ఫిర్యాదులు



ఫిర్యాదీల సమస్య వింటున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌కు 47 ఫిర్యాదులు అందాయని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులను ఆయన నేరుగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

వర్గీకరణలో మాదిగలకు అన్యాయం


సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎస్సీ వర్గీకరణ అమలులో మాదిగలకు అన్యాయం జరుగుతోందని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లలో మాలలకు 8 శాతం, మాదిగలకు 6 శాతం ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మాదిగలకు చంద్రబాబు అన్యాయం చేస్తుంటే మంద కృష్ణ మాదిగ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. 30 ఏళ్లుగా మాదిగలు పోరాటం చేస్తే, ఫలాలు మాలలకు అందించడం దురదృష్టకరమన్నారు. వర్గీకరణ అమలులో మాల, మాదిగలకు చెరో 7 శాతం, ఉప కులాలకు ఒక శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ఇతర పథకాలకు దారి మళ్లిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలు ఉమ్మడిగా కాకుండా ఎ, బి, సి, డి గ్రూపులుగా కేటాయించాలని కోరారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి, జూన్ 5న అమరావతిలో మాదిగ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని వెంకటేశ్వరరావు చెప్పారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బలంకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నదీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

రావులపాలెం: సరస్వతీ నదీ పుష్కరాలకు రావులపాలెం ఆర్‌టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ జీజీవీ రమణ సోమవారం తెలిపారు. రావులపాలెం డిపో నుంచి వరంగల్, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, రామప్ప దేవాలయాల దర్శనాలతో పాటు సరస్వతీ నదిలో పుష్కర స్నానం చేసే విధంగా రెండు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఈ నెల 15 తేదీన రావులపాలెం నుంచి బయలుదేరుతున్నట్టు తెలిపారు. ప్రయాణికుల నుంచి విశేష స్పందన ఉన్న కారణంగా ఈ నెల 20వ తేదీన మరో రెండు బస్సులు పంపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.

బీసీలకు భంగపాటు

- పదవుల పందేరంలో అవమానం
- కౌడా చైర్మన్, జనసేన నేతకే డీసీసీబీ కిరీటం
- 'దేశం' అధిష్టానంపై పిల్లి సత్తిబాబు వర్గం గుర్రు
- కోనసీమకు డీసీఎంఎస్‌తో సరి



సాక్షి ప్రతినిధి, కాకినాడ: టీడీపీలో బీసీలు భంగపాటుకు గురయ్యారు. పదవుల పందేరంలో అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆవిర్భావం నుంచీ పార్టీ కోసం క్రమశిక్షణతో పని చేస్తున్న తమకు ప్రాధాన్యం లేకుండా చేస్తున్నారని, అప్రధానమైన పదవులతో చేతులు దులిపేసుకుంటున్నారని మండిపడుతున్నారు. బీసీలే తమ పార్టీకి బలం, బలగమని గొప్పలకు పోయే టీడీపీలో పదవులకు వచ్చేసరికి మోకాలడ్డుతున్నారని ఆ సామాజికవర్గం అగ్గిమీద గుగ్గిలమవుతోంది. నామినేటెడ్ పోస్టుల భర్తీలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తమ సామాజిక వర్గానికి సరైన ప్రాతినిధ్యం కల్పించలేదని బీసీలు ఆగ్రహోదగ్రులవుతున్నారు. గతంలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యం కలిగిన రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చిన రోజులు గుర్తుకు తెచ్చుకుని.. ఇప్పుడు కేవలం జిల్లా స్థాయిలో కూడా సరైన ప్రాధాన్యం లేని పోస్టులతో అవమానించారని ఆవేదన చెందుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో పెద్ద పీట

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు అన్ని విధాలా పెద్ద పీట వేయడాన్ని వారు ప్రస్తావిస్తున్నారు. నామినేటెడ్ పదవులే కాకుండా చట్టసభలకు కూడా పంపించిన ఘనత నాడు వైఎస్సార్ సీపీకే దక్కింది. ఉమ్మడి జిల్లా చరిత్రలో ఏ పార్టీ చేయని విధంగా తొలిసారిగా రాజ్యసభకు బీసీలను పంపిస్తూ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. మంత్రిగా ఉన్న పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను ఏకంగా పెద్దల సభకు పంపించారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ స్థానాన్ని తొలిసారి బీసీలకు కేటాయించి మార్గాని భరత్‌రామ్‌ను ఎంపీని చేశారు. కోనసీమ నుంచి కుడుపూడి సూర్యనారాయణరావు, కాకినాడ నుంచి కర్రి పద్మశ్రీ వంటి వారిని శాసన మండలికి పంపించారు. బీసీలకు వైఎస్సార్ సీపీ అంత ప్రాధాన్యం ఇస్తే.. కూటమిలో అప్రధాన పదవులతో మమ అనిపించేస్తున్నారని ఆ సామాజికవర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.

'ఢీ'సీసీబీ

- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ పదవిని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు మొదటి నుంచీ ఆశించి చివరకు భంగపాటుకు గురయ్యారు. కూటమి పొత్తులో కాకినాడ రూరల్ సీటును త్యాగం చేసి, జనసేన గెలుపు కోసం పని చేయడమే తాము చేసిన పాపమా అని సత్తిబాబు వర్గం ప్రశ్నిస్తోంది. డీసీసీబీ పదవి వారికి రాకుండా జనసేన వైపు నుంచి అడ్డం పడ్డారనే ప్రచారం తెర మీదకు వచ్చింది. అనంతలక్ష్మి లేదా సత్తిబాబుల్లో ఎవరికి డీసీసీబీ దక్కినా రూరల్ నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీకి పోటీగా నిలుస్తారనే ఉద్దేశంతోనే మోకాలడ్డారని కూటమి నేతలు చెప్పుకొంటున్నారు. తమకు జరిగిన అన్యాయంపై అధిష్టానం వద్దనే తేల్చుకుంటామని సత్తిబాబు వర్గం అంటోంది.
- ఇదే సామాజికవర్గం నుంచి కోనసీమలోని కొత్తపేటకు చెందిన శాసన మండలి మాజీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం (ఆర్ఎస్) పేరు కూడా ప్రచారంలోకి వచ్చింది. ఆవిర్భావం నుంచీ పార్టీలో క్రియాశీలకంగా ఉన్న ఆయనను కూడా పక్కన పెట్టడాన్ని ఆ వర్గం ప్రశ్నిస్తోంది. ఒకవేళ పొత్తులో భాగంగా జనసేనకు డీసీసీబీని కేటాయించాలనుకుంటే, ఇప్పటికే నామినేటెడ్ పదవి పొందిన తుమ్మల రామస్వామి(బాబు)కే మళ్లీ కట్టబెట్టడమేమిటని, ఆ పార్టీలో బీసీ నాయకులే లేరా అని ప్రశ్నిస్తున్నారు. టీడీపీ, జనసేన పార్టీలు రెండూ బీసీలను ఓటు బ్యాంకుగానే పరిగణిస్తుండటాన్ని ఆ సామాజికవర్గం జీర్ణించుకోలేకపోతోంది. డీసీసీబీ బీసీలకు ఇవ్వకూడదని ఎక్కడైనా చట్టంలో ఉందా అని నిలదీస్తోంది.

అప్రధాన పోస్టుతో సరి

బీసీ సామాజికవర్గంలో శెట్టిబలిజలు డీసీసీబీ పదవిని ఆశిస్తే చివరకు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌తో సరిపెట్టారు. దీనిని అమలాపురం రూరల్ ప్రాంతానికి చెందిన పెచ్చెట్టి చంద్రమౌళికి ఇచ్చారు. తమ వర్గానికి పెద్దగా ప్రాధాన్యం లేని ఈ పోస్టు ఇచ్చి అన్యాయం చేశారని బీసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ పోస్టు ఇవ్వడానికి కూడా కూటమి పెద్దలు ముప్పుతిప్పలు పెట్టారని అంటున్నారు. అదే డీసీసీబీకి వచ్చేసరికి జనసేన నుంచి ఇప్పటికే ఒక పదవిలో ఉన్న వ్యక్తికే మళ్లీ ఈ పదవి కూడా ఇవ్వడం ద్వారా కూటమి శ్రేణులకు ఎటువంటి సంకేతాలు ఇవ్వదలుచుకున్నారో అర్థం కావడం లేదని అంటున్నారు.

మళ్లీ ఆయనకేనా..!

జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబుకు గతంలో కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) చైర్మన్ పదవి కట్టబెట్టారు. ఈ పదవి దక్కి ఆరు నెలలు కూడా గడవకుండానే ఇప్పుడు ఆయనకే డీసీసీబీ చైర్మన్‌గిరీ కూడా ఇవ్వడంలో ఔచిత్యమేమిటని ఆ పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు. (కౌడా చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు బాబు ప్రకటించారు.) డీసీసీబీ చైర్మన్‌గా అర్హత కలిగిన మరో నాయకుడే జనసేనలో లేరా అని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇలా కూటమిలోని రెండు పార్టీలూ ఓట్ల కోసం బీసీలను కరివేపాకుల్లా వాడుకుని ఆనక గాలికి వదిలేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆప్కాబ్‌పై 'మెట్ల' ఆశలు గల్లంతు

నామినేటెడ్ పందేరంలో మాజీ మంత్రి దివంగత డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు తనయుడు రమణబాబుకు మొండిచేయే ఎదురైంది. ఆప్కాబ్ చైర్మన్‌గిరీ కోసం ఆయన మొదటి నుంచి తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేశారు. చంద్రబాబు, లోకేష్.. ఇలా ముఖ్యులందరినీ కలిసినా ఫలితం దక్కలేదని మెట్ల వర్గం అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. చంద్రబాబు సొంత సామాజిక వర్గం నుంచి గన్ని వీరాంజనేయులుకు అగ్రతాంబూలం ఇచ్చారు. ఇలా ఇటు టీడీపీ, అటు జనసేన పార్టీల్లో నామినేటెడ్ పోస్టులు రచ్చరచ్చ అవుతున్నాయి.

రత్నగిరి కిటకిట



వ్రత మండపం వద్ద వేచి ఉన్న భక్తులు

అన్నవరం: వేలాదిగా వచ్చిన భక్తులతో రత్నగిరి సోమవారం కిటకిటలాడింది. సత్యదేవుని కల్యాణోత్సవాలు, వేసవి సెలవులు, వివాహాల నేపథ్యంలో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సత్యదేవుని సుమారు 40 వేల మంది దర్శించుకున్నారు. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట పట్టింది. వ్రతాలాచరించే భక్తులు గంటసేపు వ్రత మండపాల్లో వేచి ఉండాల్సి వచ్చింది. వ్రతాలు 2,100 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు 6 వేల మంది భక్తుల్లు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు.

ఎండ దెబ్బకు విలవిల

సత్యదేవుని ఆలయానికి వచ్చిన భక్తులు తీవ్రమైన ఎండ వేడితో అల్లాడిపోయారు. 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రత నమోదవడంతో నీడకోసం ఆలయ ప్రాంగణంలోని చెట్లు, చలువ పందిళ్లను ఆశ్రయించారు. ఆలయ ప్రాంగణంలో అక్కడక్కడా కార్పెట్ ఉన్నప్పటికీ.. కారు పార్కింగ్ వద్దకు, దేవస్థానం బస్టాండ్ వద్దకు వెళ్లేందుకు సిమెంటు, తారు రోడ్లపై నడవాల్సి రావడంతో కాళ్లు కాలిపోయి చాలామంది ఇబ్బందులు పడ్డారు. ఆలయ ప్రాంగణంలో ప్లాస్టిక్ కార్పెట్ వాడవద్దని, కొబ్బరి పీచుతో చేసిన కార్పెట్‌నే వాడాలని గతంలో దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఆదేశించారు. అయినప్పటికీ పశ్చిమ రాజగోపురం ముందు ప్లాస్టిక్ కార్పెట్లే వేశారు. అవి ఎండకు త్వరగా వేడెక్కి పోవడంతో, వాటి మీద నడిచిన భక్తులు నానా ఇక్కట్లూ పడ్డారు. భక్తుల కాళ్లు కాలకుండా నివారించేందుకు ఆలయ ప్రాంగణం, పశ్చిమ రాజగోపురం, తూర్పు రాజగోపురం, రామాలయం ముందు ప్రాంతాల్లో కొబ్బరి పీచు కార్పెట్లు వేయడంతో పాటు, ఆ ప్రదేశాలను నీటితో తడిపితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పదోన్నతుల కోసం ఏఎన్ఎంల ధర్నా



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఏఎన్ఎంలు

కాకినాడ క్రైం: అర్హులైన తమకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఎన్ఎంలు నిరసన బాట పట్టారు. సోమవారం సాయంత్రం కాకినాడలోని కార్యాలయ ఆవరణలో ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సంయుక్తాధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అస్కరరావు, శ్రీకాంత్‌రాజు మాట్లాడుతూ, ఏఎన్ఎంలకు పదోన్నతులు కల్పించడంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పదోన్నతులపై తాత్సారం చేయడం తగదన్నారు. డీఎంహెచ్‌వో సహా డిప్యూటీ డెమో వైఖరే ఇందుకు కారణమని ఆరోపించారు. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వోకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో స్పందించిన డీఎంహెచ్‌వో మంగళవారం మెరిట్ లిస్ట్ ప్రదర్శించి, 22వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఏఎన్ఎంలు నిరసన విరమించారు.

ప్రత్యంగిర హోమానికి బ్రేక్

- సత్యదేవుని కల్యాణోత్సవాల పేరిట నిలుపుదల
- గతంలో ఎప్పుడూ ఇలా లేదని భక్తుల అసంతృప్తి



2021 మే నెలలో ప్రత్యంగిర హోమంలో పాల్గొన్న అప్పటి ఈఓ త్రినాథరావు

అన్నవరం: రత్నగిరి వన దేవత వనదుర్గ అమ్మవారికి వైశాఖ పౌర్ణమి సందర్భంగా నిర్వహించాల్సిన ప్రత్యంగిర హోమం సోమవారం నిర్వహించలేదు. సత్యదేవుని కల్యాణోత్సవాల సందర్భంగా పలు వైదిక కార్యక్రమాలు నిలుపు చేసిన దేవస్థానం అధికారులు ఈసారి కొత్తగా వనదుర్గ అమ్మవారి హోమాలు కూడా నిలిపివేశారు. గత శుక్రవారం చండీ హోమం, తాజాగా ప్రత్యంగిర హోమం నిర్వహించకపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గతంలో 2019 నుంచి 2024 వరకూ దేవదాయ శాఖ అధికారులే అన్నవరం దేవస్థానం ఈఓలుగా వ్యవహరించారు. అప్పట్లో ఏ సంవత్సరంలోనూ సత్యదేవుని కల్యాణోత్సవాల పేరిట ఈ హోమాలు నిలిపివేయలేదు. 2019 కల్యాణోత్సవాలకు దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ పి.సురేష్ బాబు, 2021, 2022 సంవత్సరాల్లో వి.త్రినాథరావు, 2023లో చంద్రశేఖర్ ఆజాద్, గత ఏడాది కల్యాణోత్సవాల సమయంలో ప్రస్తుత దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఈఓలుగా పని చేశారు. వీరి హయాంలో వనదుర్గ అమ్మవారి చండీ, ప్రత్యంగిర హోమాలు యథావిధిగా జరిగాయి. ఏటా వైశాఖ పౌర్ణమి సందర్భంగా జరిగే సత్యదేవుని చక్రస్నానం నాడే ప్రత్యంగిర హోమం నిర్వహించేవారు. చక్రస్నానం అనంతరం ప్రత్యంగిర హోమం పూర్ణాహుతిలో అప్పట్లో ఈఓలు పాల్గొనేవారు. 2021లో సత్యదేవుని చక్రస్నానం, వనదుర్గ అమ్మవారి ప్రత్యంగిర హోమం పూర్ణాహుతిలో అప్పటి ఈఓ త్రినాథరావు దంపతులు పాల్గొన్నారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖకు చెందిన వీర్ల సుబ్బారావు ఈఓగా ఉన్నారు. ఈ ఏడాది హోమాలు నిలిపివేయడం ద్వారా కొత్త సంప్రదాయం నెలకొల్పారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చైర్మన్ పట్టించుకోవాలి

రత్నగిరిపై సత్యదేవుని ఆవిర్భావం నుంచి కొద్ది కాలం ఇతరులు చైర్మన్లుగా ఉన్నా గత 135 సంవత్సరాలుగా వ్యవస్థాపక ధర్మకర్తలు, చైర్మన్లుగా దాదాపు ఇనుగంటి వంశీకులే వ్యవహరిస్తున్నారు. రాజా ఇనుగంటి వేంకట రామారాయణం, రాజా ఇనుగంటి ప్రకాశరావు, ఇనుగంటి గోపాలరావు, తరువాత రాజా ఐవీ రామ్‌కుమార్ ధర్మకర్తలుగా వ్యవహరించారు. వారందరూ దేవుని కార్యక్రమాలకు ఏ లోటూ రానిచ్చేవారు కాదు. పూజలు, హోమాలు ఏవి నిలుపు చేసినా ఊరుకునేవారు కాదు. ప్రస్తుతం ఇనుగంటి వంశంలో ఐదో తరానికి చెందిన ఐవీ రోహిత్ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఏటా స్వామివారి కల్యాణోత్సవాల్లో యథావిధిగా జరిగే వనదుర్గ అమ్మవారి చండీ, ప్రత్యంగిర హోమాలు నిలిపివేస్తే ఆయన పట్టించుకోకపోవడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అమ్మవార్లకు అపచారం జరుగుతూంటే ఎందుకు అడ్డుకోవడం లేదని, ఇప్పుడైనా ఆయన పట్టించుకుని, పరిస్థితిని చక్కదిద్దాలని భక్తులు సూచిస్తున్నారు.

ఘనంగా సత్యదేవుని చక్రస్నానం

- వేడుకగా నాగవల్లీ పట్టు, దండియాడింపు కార్యక్రమాలు
- రత్నగిరిపై నేడు శ్రీపుష్పయాగం



స్వామి, అమ్మవార్లకు అవభృథ స్నానం నిర్వహిస్తున్న పండితులు



నాగవల్లీ పట్టు వేడుకల్లో సత్యదేవుడు, అమ్మవార్లతో అర్చకులు

అన్నవరం: వార్షిక దివ్యకల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం పంపా జలాల్లో సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవార్లకు చక్రస్నానం, సాయంత్రం రత్నగిరిపై నాగవల్లి, దండియాడింపు కార్యక్రమాలను పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెళ్లి పెద్దలు సీతారాములు వెంట రాగా నవదంపతులు సత్యదేవుడు, అమ్మవార్లను ఉదయం 8.30 గంటలకు ఊరేగింపుగా పంపా నదీ తీరానికి తీసుకువచ్చారు. అక్కడి మండపం లోపల సింహాసనంపై స్వామి, అమ్మవార్లను, మరో ఆసనం మీద సీతారాములను వేంచేయించి, పూజలు చేశారు. పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి, శూలానికి పంచామృతాలతో అవభృథ స్నానం చేయించారు. అనంతరం బలిమూర్తికి, సుదర్శన చక్రాన్ని ఊరేగింపుగా పంపా నది లోపలకు తీసుకువెళ్లి నదిలో మూడుసార్లు చక్రస్నానం చేయించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యశర్మ, అర్చకులు దత్తు శర్మ, సుధీర్, పవన్, దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, వైదిక కమిటీ సభ్యుడు, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పురోహితులు పాలంకి పట్టాభి, అంగర సతీష్ తదితరులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

రత్నగిరిపై అనివేటి మండపంలో స్వామి, అమ్మవార్లకు సాయంత్రం నాగవల్లి పట్టు, నీలలోహిత ధారణ, దండియాడింపు కార్యక్రమాలను పండితులు ఘనంగా నిర్వహించారు. సత్యదేవుడు, అమ్మవార్లను ప్రత్యేక వేదిక మీద, పెళ్లిపెద్దలు సీతారాములను మరో ఆసనం మీద ఆశీనులను చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రంగులతో నాగవల్లి తీర్చిదిద్ది పూజలు చేశారు. అమ్మవారికి నీలలోహిత ధారణ చేశారు. ధ్వజావరోహణ చేసిన తరువాత అర్చకులు కంకణ విమోచనం చేశారు. అనంతరం వధూవరులైన అమ్మవారు, సత్యదేవుని తరఫున అర్చకులు బంతులాట, బిందెలో ఉంగరం వెతకడం వంటి వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యశర్మ, అర్చకులు కొండవీటి రాజా, పవన్, యడవిల్లి ప్రసాద్ తదితరులు స్వామి, అమ్మవార్ల విగ్రహాలు పట్టుకుని నృత్యం చేస్తూ, ఒకరిపై ఒకరు రంగులు జల్లుకున్నారు. ప్రధానాలయంలో సత్యదేవుడు, అమ్మవార్లకు, రామాలయంలో సీతారాముల విగ్రహాలపై కూడా రంగులు జల్లారు. సిబ్బంది కూడా ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుని వేడుక చేశారు.

నేడు కల్యాణోత్సవాల ముగింపు

సత్యదేవుడు, అమ్మవార్ల శ్రీపుష్పయాగం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించేందుకు అధికారులు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి నిత్య కల్యాణ మండపంలో రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు, మహిళలకు జాకెట్టు ముక్కలు పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా నిత్య కల్యాణ మండపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. ఈ వేడుకతో సత్యదేవుని దివ్యకల్యాణోత్సవాలు ముగియనున్నాయి.

అన్నవరంలో నేడు

తెల్లవారుజామున 3.00 : సుప్రభాత సేవ
ఉదయం 8.00 : చతుర్వేద పారాయణ
రాత్రి 7.30 : రత్నగిరిపై స్వామివారి నిత్యకల్యాణ మండపంలో సత్యదేవుని శ్రీపుష్పయాగ మహోత్సవం
ఉదయం 7.00 – 10.00, సాయంత్రం 5.00 – రాత్రి 11.00 : సాంస్కృతిక కార్యక్రమాలు

పోలవరం కాలువ గట్టుపై ఇండస్ట్రియల్ పార్కా?

జగ్గంపేట: పోలవరం ఎడమ కాలువ గట్టుపై ఇండస్ట్రియల్ పార్కుకు ఏవిధంగా అనుమతిచ్చారని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత ఆర్గనైజింగ్ కార్యదర్శి పులి ప్రసాద్ ప్రశ్నించారు. జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో పోలవరం కాలువ గట్టుపై అక్రమ కట్టడాలను తక్షణం తొలగించాలని కోరుతూ జగ్గంపేటలో ప్రాజెక్ట్ సబ్ డివిజన్ డీఈ పి.శ్రీనివాస్‌కు సోమవారం ఆయన వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎటువంటి అనుమతులూ లేకుండా పోలవరం కాలువ గట్టుపై కాపు, క్రిస్టియన్ కల్యాణ మండపాలు, స్టేడియం ఇప్పటికే నిర్మించినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఇప్పుడు ఇక్కడే కూటమి ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేసిందని, స్థలం ఇరిగేషన్ డిపార్టుమెంట్‌ది అయితే కలెక్టర్ ఎలా అనుమతిస్తారని ఆయన ప్రశ్నించారు. ఇదే ప్రాంతంలో గతంలో ఆర్యవైశ్య కల్యాణ మండపం, అంబేడ్కర్ సామాజిక భవనం నిర్మాణాలకు ప్రయత్నిస్తే కలెక్టర్ అనుమతి కుదరదంటూ పోలవరం అధికారులు అడ్డుకున్నారని పేర్కొన్నారు. అదే స్థలంలో పారిశ్రామిక పార్కు నిర్మాణానికి ఎలా అంగీకరించారని ప్రశ్నించారు. పోలవరం కాలువకు తీసుకున్న భూమి మిగిలి ఉంటే తిరిగి రైతులకు ఇచ్చేయాలని, లేదంటే లీజుకు ఇవ్వాలని లేదా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సూచించారు. పోలవరం కాలువ గట్టుపై అక్రమ కట్టడాలను అడ్డుకోకపోతే ఉద్యమిస్తామని, ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ప్రసాద్ తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న కారు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



ఢీకొనడంతో కారుపై ఒరిగిన విద్యుత్ స్తంభం

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులో కొదండరామపురం వద్ద సోమవారం కారు అదుపు తప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీ కొంది. విద్యుత్తు స్తంభం విరిగి కారుపై పడింది. దాంతో ఆ రోడ్డులో రాకపోకలు చేస్తున్నవారు పరుగులు తీశారు. పిఠాపురం వైపు నుంచి సామర్లకోట వైపు వస్తున్న కారు అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కారు ముందు భాగం నుజ్జునజ్జు అయింది. కారు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి వెంటనే కారు నుంచి దిగి పోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారంతో అధికారులు విద్యుత్తు సరఫరాను నిలిపి వేశారు. కారు నడుపుతున్న వ్యక్తి సూరంపాలెంలోని ఒక యూనివర్సిటీలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నట్లు తెలిసింది.

పంట చేలోకి వెళ్లిన కారు



చేలోకి వెళ్లిన కారు

పెరవలి: అదుపు తప్పిన కారు పంట చేలోకి వెళ్లటంతో పాటు కొబ్బరి చెట్టును ఢీకొట్టి ఆగింది. పెరవలి మండలం వడలి- ముక్కామల ఆర్‌అండ్‌బీ రహదారిలో సోమవారం తెల్లవారు జాము జరిగిన ఈ ప్రమాదంలో చిన్ని చిన్న గాయాలతో బయటపడ్డారు. ఏ ఊరు వారో తెలియదు కానీ మద్యం మత్తులో కారు వేగంగా వచ్చిందని, అదుపు తప్పిన కారు ముందుగా ఎలక్ట్రికల్ స్తంభాన్ని రాసుకుంటూ వెళ్లి చేలో ఉన్న కొబ్బరి చెట్టును ఢీకొట్టి ఆగిందని స్థానికులు చెప్పారు. ఆ సమయంలో పెద్ద శబ్దం రావటంతో పరుగున వచ్చినా కారులో ఉన్నవారు వెళ్లిపోయారని తెలిపారు. అదే పగలు జరిగి ఉంటే పెను ప్రమాదం జరిగేదని రాత్రి అవ్వటం వలన జన సంచారం లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

బడి బస్సుల భద్రత ఎంత?!

- ఈ నెల 15తో ముగుస్తున్న పాత ఎఫ్‌సీ గడువు
- కొత్తగా ఎఫ్‌సీలు జారీచేస్తున్న అధికారులు
- స్పీడ్ గవర్నర్స్ ఏర్పాటు తప్పనిసరి
- జిల్లాలో 835 పాఠశాల, కళాశాల బస్సులు

రాయవరం: ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో బస్సుల వినియోగం పెరిగింది. జిల్లాలో వివిధ రకాల ప్రైవేట్ విద్యా సంస్థలు 580 వరకు ఉన్నాయి. వచ్చే నెల 12వ తేదీ నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అధిక శాతం మంది బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. బస్సు సామర్థ్యం సరిగా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఫలితంగా విద్యార్థుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. అందుకే ఏటా మోటార్ వెహికల్ తనిఖీ అధికారులు బస్సు కండిషన్ చెక్ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) జారీ చేస్తుంటారు. గతేడాది జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు ఈ నెల 14తో ముగియడంతో, ఈ నెల 15 నుంచి కొత్తగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రారంభమైంది. విద్యార్థులను సురక్షితంగా ఇంటి నుంచి పాఠశాలలకు, పాఠశాల నుంచి ఇంటికి చేరవేసే వాహనాల సామర్థ్యం (ఫిట్‌నెస్) ఎలా ఉంది? అన్న విషయాన్ని తేల్చే పనిని రవాణా శాఖ అధికారులు చేపట్టనున్నారు.



స్కూల్ బస్సు తనిఖీ చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

835 పాఠశాల బస్సులు

కోనసీమ జిల్లాలో 580 వరకు ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల పరిధిలో 835 ప్రైవేట్ బస్సులు, వ్యాన్‌లు ఉన్నాయి. జూన్ 15వ తేదీలోగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ఆయా పాఠశాలల యాజమాన్యాలు పొందాల్సి ఉంది. 2017 నుంచి స్కూల్ బస్సులకు స్పీడ్ గవర్నర్స్ ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి చేశారు. స్కూల్ బస్సుల వేగం గంటకు 60 కిలోమీటర్లు మించి ఉండకూడదు.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ నిబంధనలివీ..

బస్సు డ్రైవర్‌కు బీపీ, సుగర్, కంటి సంబంధిత సమస్యలు లేవని సర్టిఫికెట్ సమర్పించాలి. ఈ సర్టిఫికెట్ బస్సులో ఒకటి, యజమాని వద్ద ఒకటి ఉంచాలి. బస్సు అన్ని లైట్లు పనిచేయాలి. రిఫ్లెక్టివ్ టేపును బస్సుకు నాలుగు వైపులా అతికించాలి. బస్సుకు ఉన్న గ్లాసులు అన్నీ పటిష్టంగా ఉండేలా చూడాలి. బస్సు నుంచి పొగ రాకుండా చూడాలి. బ్రేక్ కండిషన్‌లో ఉండాలి. స్పీడో మీటర్ పనిచేయాలి. స్టీరింగ్, టైర్లు కండిషన్‌లో ఉండాలి. డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవం ఉండాలి. 60 ఏళ్ల లోపు వయసు ఉండాలి. బస్సులో అత్యవసర ద్వారం, మంటలను ఆర్పే పరికరం ఉండాలి. బస్సులో మందులు, పరికరాలతో కూడిన ప్రథమ చికిత్స పెట్టి అందుబాటులో ఉంచాలి. వారానికి ఒకసారి ప్రిన్సిపాల్ లేదా సంబంధిత అధికారి దీన్ని తనిఖీ చేయాలి. నెలకొకసారి పేరెంట్స్ కమిటీ ఈ ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ను తనిఖీ చేయాలి. దీనికోసం ప్రత్యేక రిజిస్టర్‌ను నిర్వహించాలి. బస్సులో సీట్ల కింద బ్యాగులు ఉంచుకునేందుకు అరల ఏర్పాటు ఉండాలి. సైడ్ విండోలకు మధ్యలో 31 అంగుళాలకు మించని దూరంలో అడ్డంగా మూడు లోహపు కడ్డీలు అమర్చి ఉండాలి. ప్రతి విద్యా సంస్థ యాజమాన్యం విద్యాశాఖ, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్, సౌజన్యంతో విద్యార్థులకు ఏడాదికి ఒక రోజు రోడ్ సేఫ్టీ తరగతులు నిర్వహించాలి. బస్సు ఫుట్ బోర్డుపై మొదటి మెట్టు భూమి నుంచి 325 మిల్లీమీటర్ల ఎత్తుకు మించరాదు. అన్ని మెట్లు జారకుండా ఉండే లోహంతో అమర్చబడి ఉండాలి. బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకునేందుకు వీలుగా బస్సు ముందరి తలుపు మెట్లకు సమాంతరంగా రైలింగ్‌లు ఏర్పాటు చేయాలి. బస్సు అటెండెంట్ బస్సు బయట దగ్గరగా నిలబడి విద్యార్థులు బస్సు నుంచి సురక్షితంగా దిగేలా, ఎక్కేలా చూడాలి. పాఠశాల వద్ద బస్సుల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం ఉండాలి. బస్సులో అటెండర్ ఉండాలి. సీటింగ్ కెపాసిటీకి మించి విద్యార్థులను ఎక్కించకూడదు. బస్సు ఎడమవైపు ముందు భాగంలో యాజమాన్యం వివరాలు పొందుపర్చాలి. రూట్ ప్లాన్ బస్సులో ఉంచాలి. విద్యార్థుల సంఖ్య, వారి పూర్తి వివరాలు బస్సులో ఏర్పాటు చేయాలి. బస్సులో ఫిర్యాదుల పుస్తకాన్ని ప్రతి నెలా యాజమాన్యం తనిఖీ చేయాలి. బస్సులో అటెండర్ తప్పకుండా యూనిఫామ్ ధరించాలి.

ఆన్‌లైన్లో తేదీల ఖరారు

జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల బస్సుల సామర్థ్య పరీక్షలు చేపట్టడానికి మండపేట, రామచంద్రపురం, అమలాపురం రవాణాశాఖ కార్యాలయాలు సన్నద్ధమయ్యాయి. వాహన ఫిట్‌నెస్ ధ్రువీకరణ కోసం ముందుగా ఆన్‌లైన్లో నమోదు చేశాక ఓ తేదీని కేటాయిస్తారు. ఆ ప్రకారం వాహనాన్ని రవాణా శాఖ కార్యాలయానికి తీసుకొస్తే, అందరి సమక్షంలో వాహన ఫిట్‌నెస్ తనిఖీ చేస్తారు. వాహన కండిషన్‌పై సమగ్ర పరిశీలన అనంతరం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. బస్సులు ఏ విధంగా ఉండాలన్న దానిపై విస్తృతమైన ప్రచారం చేయాల్సిన బాధ్యత రవాణాశాఖ అధికారులపై ఉంది.

నిబంధనలు పాటించకుంటే సీజ్ చేస్తాం



మోటార్ వాహనాల నిబంధనలు పాటించని పాఠశాల, కళాశాలల బస్సులను సీజ్ చేస్తాం. పాఠశాలలు తెరిచిన నాటి నుంచి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం. గడువు ముగిసిన తర్వాత ఎఫ్‌సీ, పర్మిట్, కండిషన్ లేని బస్సులను సీజ్ చేస్తాం.

– డి.శ్రీనివాసరావు,
జిల్లా రవాణాశాఖ అధికారి,
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

జిల్లా బ్యాడ్మింటన్ సంఘ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా బ్యాడ్మింటన్ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం కాకినాడలో ఓ హోటల్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్‌వర్మ, కార్యదర్శిగా ఫణిగోపాల్, కోశాధికారిగా భాస్కరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా చంద్రుగొవిందరాజు, కర్రి భామిరెడ్డి, ద్వారంపూడి వీరభద్రారెడ్డిని సంఘం ఎన్నుకుంది. ఉపాధ్యక్షులుగా ఎమ్.మురళీధర్, పీఎస్ గణేష్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా కృష్ణమూర్తి, అడ్డాల సత్యనారాయణ, జగన్నాథ్, సభ్యులుగా కేవీబీ కృష్ణంరాజు, యు.రామకృష్ణ, కె.నరసింహరావు, వి.శారదాదేవి, కె.శ్రీనివాస్, లక్ష్మణ్‌కుమార్, రామ్‌మోహన్‌రావు ఎన్నికయ్యారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- ఆర్టీసీ బస్ నుంచి ఊడిన డీజిల్ ట్యాంక్
- డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్ నిలిపివేత



ఆర్టీసీ బస్ నుంచి ట్యాంక్ ఊడిపోవడంతో కారుతున్న డీజిల్

సీతానగరం: మండలంలోని వంగలపూడి ఏటిగట్టుపై పెను ప్రమాదం తప్పింది. ఆర్టీసీ బస్ డీజిల్ ట్యాంక్ ఊడి పోవడంతో గమనించిన డ్రైవర్ బస్‌ను నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. లేకుంటే ఫైర్ అయితే తమ పరిస్థితి ఏంటని ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్లితే సోమవారం ఉదయం 9 గంటలకు పురుషోత్తపట్నం నుంచి రాజమహేంద్రవరం వెళ్లుతున్న ఆర్టీసీ బస్ డీజిల్ ట్యాంక్ వంగలపూడి – సింగవరం మధ్యలో ఊడి అందులోని డీజిల్ బయటకు లీకైంది. డ్రైవర్‌కు బస్ నుంచి శబ్దం రావడంతో ఏటిగట్టుపై బస్‌ని నిలిపివేశాడు. బస్‌ను గమనించగా డీజిల్ ట్యాంక్ ఒక వైపు ఊడి రోడ్డుపై రాసుకుంటూ వచ్చింది. బస్‌ను అలాగే నడిపి ఉంటే రోడ్డుపై ట్యాంక్ రాచుకుని నిప్పు రవ్వలు వచ్చి డీజిల్‌కు అంటుకుంటే ప్రయాణికుల పరిస్థితి ఏంటని, డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రయాణికులు, స్థానికులు డ్రైవర్‌ను అభినందించారు. ప్రయాణికులను వేరే ఆర్టీసీ బస్‌లో పంపించారు. పది కిలోమీటర్ల సీతానగరం – పురుషోత్తపట్నం రోడ్డు శిథిలం అవ్వడంతో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. గత నెలలో కూటమి నాయకులు రోడ్డుకు శంకుస్థాపన చేసినా ఇప్పటి వరకు రోడ్డు పనులు చేపట్టలేదు. రోడ్డు శిథిలమవ్వడంతో ఆర్టీసీ బస్‌లు తరచు పాడవుతున్నాయి. వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	19,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,000
గటగట (వెయ్యి)	18,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

10 మంది బైండోవర్

గోపాలపురం: మండలంలోని భీమోలులో వివాదాస్పద భూముల విషయంలో 10మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని భీమోలు గ్రామంలో సర్వే నంబరు 322లో గల 18 ఎకరాల మామిడి, జీడి మామిడితోట విషయంలో గ్రామానికి చెందిన మారెడ్డి రత్నం, కోడి దేవీవర ప్రసాద్ రెండు వర్గాలుగా ఏర్పడి భూమిలో గల పంటను ఎవరికి వారు మాకు చెందుతుందని తరచూ గొడవలు పడుతున్న నేపథ్యంలో గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా రెండు వర్గాలకు చెందిన 10 మందిపై తహసీల్దార్ కె అజయ్‌బాబు ఆధ్వర్యంలో బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

రామేశ్వరంలో హత్య



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, తదితరులు

పెదపూడి: అత్తవారి ఇంటికి వెళ్లిన అల్లుడిపై అత్తింటి బంధువులు ఇనుప రాడ్లతో దాడి చేసి హత్యకు పాల్పడిన ఘటన ఇది. పెదపూడి ఎస్సై కె.రామారావు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి... రామేశ్వరం గ్రామంలో సత్యాడ వెంకటేష్(25) గ్రామ పంచాయతీలో ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. వెంకటేష్ ఎనిమిది సంవత్సరాల క్రితం గ్రామంలో రాణిని వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. అయితే ఆ భార్యాభర్తల మధ్య ఎనిమిది నెలలగా విభేదాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో భార్య అమ్మవారి ఇంటి వద్ద ఉంటోంది. అయితే ఈ నెల 11వ తేదీ సాయంత్రం వెంకటేష్ అత్త లక్ష్మి ఇంటికి వెళ్లాడు. అక్కడ అత్తతో ఘర్షణ ఏర్పడింది. ఈ సమయంలో అత్త తరఫున ముగ్గురు బంధువులు ఇనుపరాడ్లతో వెంకటేష్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు తండ్రి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయగా కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ దర్యాప్తు చేస్తున్నారని ఎస్సై తెలిపారు. కాకినాడ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు పటేల్‌దేవరా జ్‌మనీష్, సీఐ చైతన్య కృష్ణ, ఎస్సై రామారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి సోమవారం బంధువులకు అప్పగించారు.

టైక్వాండోలో 13 మందికి బంగారు పతకాలు



విజేతలను అభినందించిన కోచ్, గ్రామస్తులు

సామర్లకోట: ఉమ్మడి జిల్లా స్థాయిలో పిఠాపురంలో నిర్వహించిన టైక్వాండో పోటీలో సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన 13 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్టు కోచ్ జాకిచాన్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా పోటీలో అచ్చంపేటకు చెందిన 13 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించడం ఆనందంగా ఉన్నదన్నారు. విద్యార్థులను గ్రామ సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు, గ్రామస్తులు అభినందించారు.

ఉరి వేసుకుని టీచర్ మృతి



విమలకుమారి మృతదేహం

నిడదవోలు రూరల్: కుటుంబ కలహాలు, భర్త వేధింపులు తాళలేక ఉరి వేసుకుని ప్రైవేటు స్కూల్ టీచర్ మృతిచెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు సోమవారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం నిడదవోలు మండలం తాడిమళ్లకు చెందిన పంతగాని విమలకుమారి (40) తిమ్మరాజుపాలెంలో ఒక ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త వెంకట శ్రీను విజయవాడలోని ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. 2015లో వివాహమైన వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా భార్యాభర్తలు పలు విషయాల్లో గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి బంధువులు ఇంటికి వివాహానికి వెళ్లే సమయంలో వివాదం తలెత్తింది. దీంతో విమలకుమారి ఇంటి పైపోర్షన్‌లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీరబాబు పేర్కొన్నారు.

పిడుగు పాటుకు నాలుగు గేదె దూడల మృతి



గోపాలపురంలో పిడుగు పడి మృతి చెందిన గేదె దూడలు



గోపాలపురం జగన్నాథపురం గ్రామాల మధ్య భారీ వృక్షాలు నేలకొరగడంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు

భారీ వృక్షాలు నేలకొరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం

గోపాలపురం: మండల కేంద్రమైన గోపాలపురంలో సోమవారం పిడుగు పడడంతో నాలుగు గేదె దూడలు మృతిచెందాయి. గోపాలపురం గ్రామానికి చెందిన అక్కాబత్తుల వెంకటేశుకు చెందిన పొలంలో నాలుగు గేదె దూడలకు సమీపంలో పిడుగు పడటంతో ఆ ధ్వనికి అవి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. గోపాలపురం నుంచి జగన్నాథపురం వెళ్లే రోడ్డులో భారీ వృక్షాలు నేలకొరగడంతో సుమారు ఆరు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ ఈదురుగాలులు వీచాయి. గోపాలపురం నుంచి కొయ్యలగూడెం వెళ్లే జాతీయ రహదారి మాతంగమ్మ మెట్ట వద్ద భారీ వృక్షం నేలకొరగడంతో అటు మూడు కిలోమీటర్లు, ఇటు మూడు కిలో మీటర్ల మేర ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో సుమారు నాలుగు గంటలపాటు ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. విద్యుత్ వైర్లపై చెట్టు పడటంతో వాటిని తొలగించడానికి సిబ్బంది అవస్థలు పడ్డారు. సుమారు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

నేడు రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా రెజ్లింగ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి జి.ఎలీషాబాబు సోమవారం తెలిపారు. సబ్ జూనియర్స్, అండర్–23 విభాగంలో జిల్లా క్రీడామైదానంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. సబ్‌జూనియర్స్ విభాగంలో 2008 నుంచి 2010, అండర్–23లో 2003 నుంచి 2006 మధ్యలో జన్మించిన వారు అర్హులన్నారు. చిత్తూరులో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఎంపికైన జట్లు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గలవారు ఈ ఎంపికలకు హాజరుకావాలని కోరారు.

రెండు చోరీ కేసుల్లో వ్యక్తికి జైలు

కాకినాడ లీగల్: వేరు వేరు ప్రాంతాల్లో బంగారం, వెండి చోరీ చేసిన వ్యక్తికి ఒక్కొక్క కేసులో నాలుగు నెలల జైలు, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఐదవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్‌షరీన్ సోమవారం తీర్పు నిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ సంజయ్‌నగర్ పర్లవపేటకు ప్రాంతానికి చెందిన సుంకర తేజ గత ఏడాది డిసెంబర్ 16 తేదీన గంగనాపల్లి గ్రామం చైతన్యనగర్ ప్రాంతంలో ఒక ఇంట్లో రూ.లక్ష విలువ గల బంగారం ఆభరణాలు చోరీ చేశాడు. తూరంగి మహాలక్ష్మినగర్‌లో గత ఏడాది డిసెంబర్ 23 తేదీన ఒక ఇంట్లో రూ.50 వేలవిలువ గల వెండి ఆభరణాలు చోరీ చేశాడు. దీంతో ఇంటి యజమానులు ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో సుంకర తేజపై నేరం రుజువు కావడంతో జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఏపీపీ పి.రఘువీర్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

చీపురు కర్ర కోసం కొట్లాట

అల్లవరం: బోడసకుర్రు పల్లిపాలెంలో మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన రెండు కుటుంబాల మధ్య సోమవారం ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు గాయాల పాలై పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. అల్లవరం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడసకుర్రు బ్రిడ్జిని ఆనుకొని కొల్లు దుర్గారావు చేపల వ్యాపారం చేస్తున్నారు. వీరి షాపు పక్కన ఓలేటి అప్పలస్వామికి చెందిన పశువుల మకాం ఉంది. మకాంలో చెత్తను ఊడ్చే చీపురు కర్ర దుర్గారావు షాపులో ఉండడంతో అప్పలస్వామి మా పశువుల మాకాంలో ఉండవలసిన చీపురు కర్ర మీ షాపులో ఉండటమేమిటని ప్రశ్నించారు. అయితే దుర్గారావు భార్య మీ చీపురు కర్ర మేమే విరగొట్టాం. అయితే ఏమిటని మాటలతో ఎదురుదాడి చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుని కొట్లాటకు దారితీసింది. దుర్గారావు, అతని భార్య, ముగ్గురు కుమారులు అప్పలస్వామిపై దాడి చేశారు. దీంతో అప్పలస్వామి కుటుంబ సభ్యులు దుర్గారావు కుటుంబ సభ్యులపై దాడి చేశారు. ఇరువర్గాల వారు ఆస్పత్రిలో చికిత్స కోసం జాయిన్ అయ్యారు. ఆస్పత్రి వారు అందించిన సమాచారం మేరకు ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై తిరుమలరావు తెలిపారు.

అడ్డుగా ఉందని పసిగుడ్డును చంపేశారు

- కేసును ఛేదించిన పోలీసులు
- కన్నబిడ్డను కడతేర్చింది తల్లి, అమ్మమ్మే!
- కేసును తప్పుదారి పట్టించడానికే క్షుద్రపూజల నాటకం
- వివరాలు వెల్లడించిన పిఠాపురం సీఐ శ్రీనివాస్



నిందితులను మీడియా ముందు ప్రవేశ పెట్టిన పోలీసులు

పిఠాపురం: పాపం పుణ్యం తెలియని పసికందును తమకు అడ్డు వస్తుందనే కారణంగా కడతేర్చినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడయినట్లు పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో ఇటీవల పసికందును హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను సోమవారం అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. కేసు వివరాలను పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ కేసులో చనిపోయిన యశ్విత తల్లి అయిన పసుపులేటి శైలజ నరసింగపురానికి చెందిన పెదపాటి సతీష్‌ను ప్రేమించి ఇరు కుటుంబాలకు ఇష్టం లేకపోయినా వివాహం చేసుకున్నారు. 2024లో వారికి పాప యశ్విత జన్మించింది. వివాహం అయినప్పటి నుంచి భర్త తనను అత్తగారింటికి తీసుకెళ్లలేదని, పాప పుట్టిన తర్వాత భర్త కుటుంబ సభ్యులు చూడ్డానికి రాలేదని, తన భర్త కూడా తనతో మునుపటిలా సఖ్యతగా ఉండడం లేదని శైలజ ద్వేషం పెంచుకుంది. తన తల్లిదండ్రులు చూసిన సంబంధం కాదని, వేరే కులానికి చెందిన సతీష్‌ను వివాహం చేసుకోవడం ఆమె తల్లి పసుపులేటి అన్నవరానికి మొదటి నుంచి ఇష్టం లేకపోవడంతో సతీష్‌కు పుట్టిన యశ్వితను అడ్డు తొలగిస్తే శైలజకు రెండో పెళ్లి చేయవచ్చనే ఉద్దేశంతో ఆ తల్లి ఉంది. దీంతో ఇద్దరూ కలిసి పసికందును అడ్డు తొలగించుకోడానికి పథకం వేశారు. అందులో భాగంగా ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత 5 నెలల వయసు గల యశ్వితను వారి ఇంటిలోనే వారిద్దరూ పీక నొక్కి చంపేశారు. అనంతరం పాప మృతదేహాన్ని ఇంటి వెనక గల నీటి బావిలో పడవేశారు. అనంతరం హత్యను కప్పిపుచ్చడానికి పాపకు ఎవరో మాంత్రికుడు చేతబడి చేసి చంపి ఉంటాడని నమ్మించి కేసును తప్పుదోవ పట్టించడానికి వారి గుమ్మం ముందు పసుపు, కుంకుమ, నిమ్మకాయ పెట్టి గుట్టుచప్పుడు కాకుండా కొంతసేపు నిద్ర పోయినట్లు నటించారు. అనంతరం లేచి తమ పాపను ఎవరో ఎత్తుకు పోయారంటు పెద్దగా కేకలు వేస్తూ హడావుడి చేసి జనాన్ని నమ్మించే ప్రయత్నం చేశారు. ఏమీ తెలియనట్లు నటిస్తూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పాప ఆచూకీ కోసం గాలించగా వారి ఇంటి పక్కనే ఉన్న బావిలో పాప మృతదేహం లభించింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌లతో ఆధారాలు సేకరించారు. పాప తల్లి శైలజ, అమ్మమ్మ పసికందును చంపి నూతిలో పడవేసి క్షుద్ర పూజల నాటకం ఆడినట్లు సాంకేతిక ఆధారాల సహాయంతో గుర్తించామన్నారు. పాప తండ్రి సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఈ కేసులో నిందితులు ఇద్దరిని సోమవారం అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్టు ఆయన తెలిపారు.